సాక్షి
నారాయణపేట

బుధవారం, 9, అక్టోబర్, 2024



జీతాలివ్వండి.. మహాప్రభో

ఇంటర్ కళాశాలల్లో వేతనాలు రాక గెస్ట్ లెక్చరర్లు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు.

వివరాలు 2లో ▸



11 యూనిట్లలో విద్యుదుత్పత్తి

ప్రియదర్శిని జూరాల జల విద్యుత్ కేంద్రాల్లోని 11 యూనిట్లలో ఉత్పత్తి కొనసాగుతోంది.

వివరాలు 2లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
34.5 /21.3

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం వేళ చిరు జల్లులు కురవచ్చు. రాత్రి చలి తీవ్రత అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

నారాయణపేట: జిల్లాలోని షెడ్యూల్డ్ కులాల విద్యార్థులు 2024–25 విద్యాసంవత్సరానికి ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కజ్జం ఉమాపతి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. దరఖాస్తు ప్రక్రియ డెమో అథెంటికేషన్, బయోమెట్రిక్ అథెంటికేషన్, రిజిస్ట్రేషన్ దశలు ఉంటాయన్నారు. పూర్తి వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు. దరఖాస్తు అనంతరం పరిశీలన కోసం కళాశాలలో అందజేయాలని సూచించారు.

నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయాలి



నారాయణపేట: రూరల్ పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయాలని ఎస్పీ యోగేష్ గౌతమ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన నిర్మాణ పనులను పరిశీలించారు. పోలీస్‌స్టేషన్‌లో ఉపయోగించే ఫర్నీచర్, ఇతర సామగ్రి నాణ్యమైనవి కొనుగోలు చేయాలని సూచించారు. ప్రజలకు సమర్థవంతంగా సేవలు అందించడానికి భవనాన్ని త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. ఆయన వెంట సీఐ శివశంకర్, రూరల్ ఎస్‌ఐ రాముడు, హౌసింగ్ ఏఈ సాయికుమార్ ఉన్నారు.

– మండలంలోని సింగారం గ్రామంలో దుర్గామాతను ఎస్పీ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని.. మండప నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలని, శోభాయాత్ర సమయంలో బందోబస్తు కల్పిస్తామన్నారు.

ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తాం : ఎమ్మెల్యే

మక్తల్: అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రకటించిన హామీలన్నీ నెరవేరుస్తామని.. ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం కాంగ్రెస్‌పార్టీకే దక్కుతుందని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. మంగళవారం పట్టణంలో రాయితీ గ్యాస్ సిలిండర్ల ప్రొసీడింగ్‌లను లబ్ధిదారులకు అందజేసి మాట్లాడారు. నియోజకవర్గంలోని రెండు రిజర్వాయర్లతో సాగునీరు అందిస్తున్నామని.. అభివృద్ధికి రూ.కోట్లు తీసుకొచ్చినట్లు చెప్పారు. అలాగే 163 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి..

మక్తల్ పుర కార్యవర్గ సమావేశం మంగళవారం చైర్‌పర్సన్ పావని అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పురపాలికలోని సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు లక్ష్మారెడ్డి, వైస్ చైర్‌పర్సన్ అఖిలారెడ్డి, కౌన్సిలర్లు జ్యోతి, శ్వేతారెడ్డి, శంకరమ్మ, తహసీల్దార్ సతీష్‌కుమార్, ఎంపీడీఓ రమేష్ పాల్గొన్నారు.

బీజేపీ గెలుపు సంబరాలు

నారాయణపేట: హర్యానా ఎన్నికల్లో బీజేపీ హ్యాట్రిక్ విజయం సాధించడం, జమ్ము, కాశ్మీర్‌లో అధిక సీట్లు సాధించడంతో మంగళవారం జిల్లాకేంద్రంలో బీజేపీ శ్రేణులు బాణసంచా కాల్చి మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకొన్నాయి. పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యుడు నాగురావు నామాజీ మాట్లాడుతూ.. ఆయా రాష్ట్రాల్లో కాంగ్రెస్‌పార్టీని ప్రజలు నమ్మలేదని, ఇందుకు వారికి వచ్చిన సీట్లే నిదర్శనమన్నారు. హర్యానాలో వరుసగా మూడోసారి బీజేపీ ప్రభుత్వం కోరుకున్న అక్కడి ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.



కొత్త టీచర్లు

డీఎస్సీ- 2024లో ఎంపికైన వారి మెరిట్ జాబితా విడుదల

- నేడు హైదరాబాద్‌లో అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇవ్వనున్న సీఎం రేవంత్‌రెడ్డి
- త్వరలోనే పాఠశాలల్లో నియామకం చేసే అవకాశం
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 1,131 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్
- స్పెషల్ ఎడ్యుకేషన్ ఎస్‌జీటీలకు ఆర్డర్లు ఇవ్వని ప్రభుత్వం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఉమ్మడి పాలమూరు వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో త్వరలోనే కొత్త ఉపాధ్యాయులు చేరనున్నారు. ఇందుకు సంబంధించి మార్చిలో డీఎస్సీ- 2024 పరీక్ష నిర్వహించిన ప్రభుత్వం ఇటీవల ఫలితాలు వెల్లడించింది. ఈ క్రమంలో 1:3 రేషియో ప్రకారం మెరిట్‌లో ఉన్నవారికి ఈ నెల 1 నుంచి 5వ తేదీ వరకు ఒరిజినల్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియను అధికారులు చేపట్టారు. 5న సాయంత్రం స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్ వారి మెరిట్ లిస్టు రావడంతో 6న అందుకు సంబంధించిన అభ్యర్థులకు కూడా వెరిఫికేషన్ నిర్వహించడంతో ప్రక్రియ పూర్తయింది. దీంతో నేరుగా 1:1 రేషియో ప్రకారం జాబితా సోమవారం వరకు రావాల్సి ఉండగా ఆలస్యమై మంగళవారం మధ్యాహ్నం వరకు అన్ని డీఈఓ కార్యాలయాలకు చేరుకుంది. దీంతో ఎంపికైన వారికి నేరుగా అధికారులు ఫోన్లు చేసి నియామకపత్రాలు తీసుకునేందుకు రావాలని సూచించారు. ఈ క్రమంలో మొత్తం 1,131 పోస్టులు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఖాళీగా ఉండగా ఇందులో కొన్ని పోస్టులకు ఆర్డర్లు ఇవ్వడం లేదని తెలుస్తుంది. చాలామంది అభ్యర్థులు అన్ని పోస్టులకు ఆర్డర్లు ఇస్తారని ఆశిస్తున్నారు. దీంతో జిల్లాల వారీగా మెరిట్‌లో ఉన్నవారు తమకు ఫోన్ రాలేదని డీఈఓ కార్యాలయాల్లో విచారణ చేసే పరిస్థితి నెలకొంది.

కోర్టులో కేసులు ఉండటంతో..

ఇందులో స్పెషల్ ఎడ్యుకేషన్ కింద ఎస్‌జీటీ పోస్టుల భర్తీ ప్రక్రియ నిలిపివేసినట్లు తెలుస్తుంది. ఈ పోస్టులకు సంబంధించి కోర్టులో కేసు ఉన్న నేపథ్యంలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ సైతం ఆలస్యంగా జరిగింది. కేసు పూర్తయిన తర్వాతే వీరికి నియామకపత్రాలు ఇవ్వనున్నట్లు సమాచారం. వీటితోపాటు పోస్టులకు సరైన అభ్యర్థులు, రిజర్వేషన్లు, ఇతరత్రా కారణాలతో బ్యాక్‌లాగ్ పోస్టులు పరిగణించినట్లు తెలుస్తుంది. మరికొన్ని పోస్టుల్లో అభ్యర్థులపై పలు కేసులు ఉన్న కారణంగా మెరిట్‌లో ఉన్నప్పటికీ వారికి ఆర్డర్లు ఇవ్వడం లేదు. అయితే కేసులు ఉన్న వారికి అవి పూర్తి అయితేనే పోస్టులు ఇవ్వనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఒక్క మహబూబ్‌నగర్‌లోనే 27 వరకు బ్యాక్‌లాగ్ పోస్టులు ఉన్నాయి. మిగిలిన బ్యాక్‌లాగ్ పోస్టులను మరో డీఎస్సీలో భర్తీ చేస్తారా.. లేక మెరిట్ ప్రకారం తర్వాతి స్థానంలో ఉన్న వారికి ఇస్తారా అనేది పెద్ద ప్రశ్నగా మిగిలింది.

సీఎం చేతుల మీదుగా ఆర్డర్లు..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎంపికైన అభ్యర్థులకు బుధవారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ఆర్డర్లు ఇవ్వనున్నారు. ఇందుకు సంబంధించి జిల్లా కేంద్రాల నుంచి అభ్యర్థుల కోసం ప్రత్యేకంగా బస్సులను అధికారులు ఏర్పాటు చేశారు. వీరిని తీసుకెళ్లేందుకు ప్రతి మండలం ఎంఈఓ లైజనింగ్ అధికారులకు బాధ్యతలు అప్పగించారు. వెళ్లిన అభ్యర్థులకు అక్కడే భోజనంతో పాటు ఇతరత్రా సదుపాయాలు కల్పిస్తారు. కాగా..మహబూబ్‌నగర్ జిల్లాలో 196 మంది, నాగర్‌కర్నూల్‌లో 210, వనపర్తిలో 126, నారాయణపేటలో 230, గద్వాలలో 146 మంది అభ్యర్థులు బుధవారం సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకోనున్నారు. మిగిలినవారికి రెండు, మూడు రోజుల్లో ఇవ్వనున్నారు.

ఉమ్మడి జిల్లాలో భర్తీ చేస్తున్న మొత్తం పోస్టులు

జిల్లా	పోస్టులు	భర్తీ చేస్తున్నవి
గద్వాల	172	149
మహబూబ్‌నగర్	243	214
నాగర్‌కర్నూల్	285	226
నారాయణపేట	279	252
వనపర్తి	152	126



మహబూబ్‌నగర్ డైట్ కళాశాలలో ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న డీఈఓ రవీందర్ (ఫైల్)

> **ఏర్పాట్లు పూర్తి చేశాం..**
>
> డీఎస్సీ- 2024 అభ్యర్థులకు ఆర్డర్లు ఇచ్చే ప్రక్రియ హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో బుధవారం జరగనుంది. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. మహబూబ్‌నగర్ జిల్లాలో మొత్తం 196 పోస్టులకు సంబంధించి నియామకపత్రాలు ఇవ్వనున్నారు.
>
> – రవీందర్, డీఈఓ, మహబూబ్‌నగర్

ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ఇలా..

జిల్లా	స్కూల్ అసిస్టెంట్		భాషా పండితులు		పీఈటీ		ఎస్‌జీటీ		ఎస్‌ఏ స్పెషల్ ఎడ్యుకేషన్		ఎస్‌జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్	
	పోస్టులు	భర్తీ	పోస్టులు	భర్తీ	పోస్టులు	భర్తీ	పోస్టులు	భర్తీ	పోస్టులు	భర్తీ	పోస్టులు	భర్తీ
గద్వాల	35	34	28	26	8	8	80	77	4	4	17	0
మహబూబ్‌నగర్	38	35	24	22	8	7	146	144	7	6	20	0
నాగర్‌కర్నూల్	70	68	18	17	2	2	141	139	13	0	41	0
నారాయణపేట	73	70	23	22	1	1	161	154	5	5	16	0
వనపర్తి	57	55	9	8	6	6	56	52	5	5	19	0

డీఎస్సీలో అవకతవకలు?



డీఈఓ కార్యాలయం ఎదుటే నిద్రిస్తున్న అభ్యర్థులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు

నాట్ విల్లింగ్ ఇచ్చినా జాబితాలో పేరు

- అనర్హులను చేర్చిన వైనం
- డబ్బుకు అమ్ముడుపోయారంటూ ఆరోపణలు
- డీఈఓ కార్యాలయం ఎదుట అర్ధరాత్రి వరకు ధర్నా

నారాయణపేట రూరల్: డీఎస్సీ తుదిజాబితా తప్పుల తడకగా ఉందంటూ మంగళవారం రాత్రి నారాయణపేట డీఈఓ కార్యాలయం ఎదుట పలువురు అభ్యర్థులు వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులతో కలిసి ధర్నా చేపట్టారు. ఎంతో కష్టపడి చదివినా లాభం లేదని.. ఉపాధ్యాయ కొలువు చేయాలనుకున్న తమకు నిరాశను మిగిల్చారంటూ కంటతడి పెట్టారు. డీఈఓ కార్యాలయంలో ఇష్టారీతిగా వ్యవహరించి అర్హులకు కాకుండా డబ్బులు ముట్టజెప్పిన వారికి పెద్దపీట వేసినట్లు పుకార్లు వస్తున్నాయి. ఈ నెల 5 వరకు జరిగిన ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ వివరాలు బయటకు ఇవ్వకుండా డీఈఓ కార్యాలయం గోప్యంగా ఉంచడం అనుమానాలకు తావిస్తోంది. కార్యాలయంలోని ఓ సీనియర్ ఉద్యోగి సాయంతో డబ్బులకు ఉద్యోగాలు అమ్ముకున్నట్లు సమాచారం.

అర్ధరాత్రి వరకు ధర్నా..

నష్టపోయిన అభ్యర్థులు అర్ధరాత్రి వరకు ధర్నా చేపట్టారు. డీఈఓను సస్పెండ్ చేయాలని, తప్పిదాలకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలంటూ నినాదాలు చేశారు. కార్యాలయంలో పనిచేసే ఓ సీనియర్ ఉద్యోగి డీఈఓతో మాట్లాడనివ్వకుండా అడ్డురావడం, బయటకు వెళ్లమని దూషించడంతో గొడవ మరింత పెద్దదిగా మారింది. నియామక ప్రక్రియలో జరిగిన అవకతవకలపై ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డికి ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి వచ్చి బాధితులను సముదాయించే ప్రయత్నం చేశారు.

> **పూర్తి పారదర్శకంగానే..**
>
> డీఎస్సీ ఎంపికలో నష్టం వాటిల్లిందని వచ్చిన ఫిర్యాదులను ఉన్నతాధికారులకు పంపిస్తాం. నిజమైన వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటాం. డీఈఓ కార్యాలయంలో ఎలాంటి తప్పులు జరగలేదు. ఒకటికి రెండుసార్లు పరిశీలించిన తర్వాతే జాబితాను పంపించాం. అనర్హులను ప్రోత్సహించాల్సిన అవసరం లేదు. పూర్తి పారదర్శకతతోనే ప్రక్రియ పూర్తి చేస్తున్నాం.
>
> – ఎండీ అబ్దుల్‌ఘని, డీఈఓ

ఇవీ తప్పిదాలు..

- ఎల్‌పీ హిందీ విభాగంలో మూడు జనరల్, ఒక ఎస్సీ రిజర్వ్ మొత్తం నాలుగు పోస్టులుండగా.. 1:3 ప్రకారం 12 మందిని ధ్రువపత్రాల పరిశీలనకు పిలవగా 8 మంది హాజరయ్యారు. 3వ ర్యాంకులో ఉన్న రవికుమార్‌కు ఈ పోస్టుకు అవసరమైన అర్హత లేకపోయినా తుది జాబితాలో పేరు చేర్చడం ఆందోళనకు కారణమైంది. 5వ ర్యాంకు సాధించిన భారతి, ఆమె భర్త నర్సింగ్ డీఈఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. వీరికి పీఆర్‌టీయూ, తపస్ నాయకులు మద్దతు తెలిపారు. రవికుమార్ బంధువు ఒకరు బేరసారాలు నడిపినట్లు తెలుస్తోంది. ఇక ఎస్సీకి రిజర్వ్ అయిన స్థానంలో 14వ ర్యాంకు అభ్యర్థి భారతి నాట్ విల్లింగ్ ఇచ్చినా ఆమెను 1:1 జాబితాలో చేర్చడంతో 30వ ర్యాంకు సాధించిన జె.ఉమ ప్రభుత్వ ఉద్యోగం కోల్పోయింది.
- ఎస్‌ఏ (బయోసైన్స్) విభాగంలో 15 పోస్టులుండగా.. 45 మందికిగాను 43 మంది ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యారు. రోస్టర్ విధానంలో మొదటి 15 ర్యాంకుల్లో రెండు ఎస్సీకి ఉండగా.. నోటిఫికేషన్‌లో మూడు ఎస్సీకి రిజర్వు చేసినట్లు ప్రకటించారు. మూడోదాన్ని 43వ నంబర్‌లో ఉన్న నర్సింహులుకు కాకుండా 258వ ర్యాంకు సాధించిన శివకు ఇచ్చారు. అయితే ఈయన వీహెచ్ కోటాలో సీటు పొందాల్సి ఉన్నా.. ఎస్సీలో కేటాయించి వీహెచ్‌ను భర్తీ చేయకుండా వదిలేశారు. దీనిపై రాద్ధాంతం జరిగింది.
- ఎస్‌ఏ తెలుగు, సోషల్ రెండు విభాగాల్లో పరీక్ష రాసిన కవిత, తిమ్మప్ప రెండింటిలోనూ 1:1కు అర్హులు. వారిద్దరు సోషల్ విభాగంలో ఉద్యోగం పొందాలని భావిస్తే వారి పేర్లను తెలుగులో చేర్చారు. రెండింటికి ఎంపికైన వారి నుంచి విల్లింగ్ లెటర్లు తీసుకోకుండా డీఈఓ కార్యాలయ అధికారులకు నచ్చినట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. సోషల్ నుంచి వీరిని తప్పించి వీరి స్థానంలో వేరే వాళ్లకు అవకాశం కల్పించేందుకు ఇలా చేశారనే ఆరోపణలు వస్తున్నాయి.
- ఎల్‌పీ తెలుగులో ఎంపికైన ఇద్దరు అభ్యర్థులు ధ్రువపత్రాల పరిశీలనకు రాకపోయినా వారి పేర్లను తుదిజాబితాలో చేర్చడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇక ఎస్జీటీ విభాగంలోనూ బీసీ–డి మహిళలకు సంబంధించి 67వ ర్యాంకు మౌనిక, 73వ ర్యాంకు శారద తర్వాత 17వ ర్యాంకర్ పి.శిరీష పేరు చేర్చడంతో ఆమె స్థానాల కేటాయింపులో అన్యాయం జరగనుంది.

వ్యవసాయ అధికారులదే కీలక పాత్ర

- కలెక్టర్ సిక్తా పట్నాయక్



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట: వరి ధాన్యం కొనుగోలులో వ్యవసాయశాఖ అధికారులే కీలకపాత్ర పోషించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏఓలు, ఏఈఓలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చి విక్రయించేలా ఏఈఓలు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలకు ఎన్ని క్వింటాళ్ల ధాన్యం విక్రయానికి వస్తుందనే సమాచారాన్ని క్లస్టర్ల వారీగా నమోదు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం సూచించిన సన్నరకం ధాన్యాన్ని ఏఈఓలు నిర్ధారించి రైతులకు టోకన్లు ఇవ్వాలని.. ఎట్టి పరిస్థితుల్లో దొడ్డు రకం ధాన్యం కొనుగోలు జరగకుండా పర్యవేక్షించాలన్నారు. గతేడాది జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. వాతావరణ పరిస్థితుల ఆధారంగా రైతులకు టోకన్లు ఇవ్వాలని, వర్షానికి ధాన్యం తడిసిపోకుండా చూడాలన్నారు. నిర్దేశించిన లక్ష్యం మేర ధాన్యం కొనుగోలు చేసి రాష్ట్రంలోనే జిల్లాను ముందువరుసలో ఉంచాలని కోరారు. సమావేశంలో శిక్షణ కలెక్టర్ గరీమా నరుల, జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్, పౌరసరఫరాలశాఖ డీఎం దేవదాస్ పాల్గొన్నారు.

హెల్ప్‌లైన్ నంబర్ 15100 స్టిక్కర్ ఆవిష్కరణ



నారాయణపేట: తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, హైదరాబాద్ జారీ చేసిన హెల్ప్‌లైన్ నంబర్ 15100ను విస్తృతంగా ప్రచారం చేసేందుకు రూపొందించిన స్టిక్కర్లను మంగళవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ రఫీ ఆవిష్కరించి మాట్లాడారు. ఇంగ్లీష్, హిందీ, తెలుగు భాషల్లో రూపొందించిన ఈ స్టిక్కర్లను బస్టాండ్లు, బస్సులు, టాక్సీస్టాండ్లు తదితర రద్దీ ప్రాంతాల్లో ప్రదర్శిస్తారని.. ఉచిత న్యాయ సలహాలు, సందేహాలకు టోల్‌ఫ్రీ నంబర్‌లో సంప్రదించి నివృత్తి చేసుకోవాలని కోరారు. అనంతరం సివిల్ జడ్జి శ్రీనివాస్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రాంగణంలో ఉన్న నోటీస్‌బోర్డులో స్టిక్కర్ అతికించారు.

జోగుళాంబ క్షేత్ర అభివృద్ధికి చర్యలు



అలంపూర్‌లో ప్రసాద్ స్కీం పనుల వివరాలు తెలుసుకుంటున్న మంత్రి కొండా సురేఖ

- రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ
- అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి

అలంపూర్: జోగుళాంబ క్షేత్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. దేవీశరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని మంగళవారం అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అంతకుముందు ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ మంత్రికి గజమాల వేసి ఘనస్వాగతం పలికారు. టూరిజం హోటల్ వద్ద కలెక్టర్ బీఎం సంతోష్, ఎస్పీ శ్రీనివాసరావు మంత్రికి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం తరఫున అమ్మవారికి మంత్రి పట్టువస్త్రాలను సమర్పించారు. ప్రసాద్ స్కీం పనులను పరిశీలించారు. అనంతరం టూరిజం హోటల్‌లో విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. అష్టాదశ శక్తి పీఠాలలో ఐదవ శక్తిపీఠంగా కొలువుదీరిన జోగుళాంబ అమ్మవారిని, బాలబ్రహ్మేశ్వరస్వామిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. కృష్ణా-తుంగభద్ర నదుల కలయిక ఈ క్షేత్రానికి ప్రత్యేక గుర్తింపునిస్తోందన్నారు. ఈ క్షేత్రంలో వెలసిన నవబ్రహ్మ ఆలయాలను దర్శించుకుంటే, కష్టాలు తీరుతాయని ఇక్కడి ప్రజల విశ్వాసంగా పేర్కొన్నారు. జోగుళాంబ ఆశీస్సులతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో ఏకైక శక్తిపీఠంగా ఉన్న జోగుళాంబ క్షేత్రాన్ని గత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కేసీఆర్ సీఎం హోదాలో పుష్కరాలకు వచ్చిన సందర్భంగా రూ.100 కోట్లు ఇస్తామని హామీ ఇచ్చి.. నిధులను మాత్రం కేటాయించలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లా కావడంతో ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. టూరిజం, ఎకో టూరిజం, పురావస్తు శాఖల సమన్వయంతో ఆలయాలను అభివృద్ధి చేస్తామన్నారు. ప్రణాళికల ఆధారంగా కేంద్రం నుంచి ఎన్ని నిధులు వస్తాయో.. రాష్ట్ర ప్రభుత్వం ఏ మేరకు నిధులు కేటాయించాలన్న విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న ప్రసాద్ స్కీం పనులను త్వరగా పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ రామకృష్ణ, ఆర్డీఓ రామచందర్, ఆలయ ఈఓ పురేందర్ కుమార్, తహసీల్దార్ మంజుల, ఆలయ కమిటీ చైర్మన్ నాగేశ్వర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ దొడ్డెన్న, రాష్ట్ర టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుడు ఎండీ ఇస్మాయిల్, ఆలయ చైర్మన్ నాగేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘ప్రజాపంపిణీ’పై పర్యవేక్షణ ఏది?

- జిల్లాలో విజిలెన్స్ కమిటీల పనితీరు నామమాత్రమే..
- జిల్లావ్యాప్తంగా 1,40, 217 రేషన్ కార్డులు

నర్వ: ప్రజాపంపిణీ వ్యవస్థపై పర్యవేక్షణకు జిల్లా, డివిజన్, మండలస్థాయిలో విజిలెన్స్ కమిటీలు ఏర్పాటు చేసినా పనితీరు నామమాత్రంగానే ఉంది. రేషన్ దుకాణాల ద్వారా లబ్ధిదారులకు బియ్యం సరఫరా, అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం పంపిణీ తీరును ఆయా కమిటీలు పరిశీలించి లోపాలుంటే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సి ఉంటుంది. జిల్లా ఏర్పాటైనప్పటి నుంచి నేటి వరకు కమిటీలు ఏర్పాటు చేసినప్పటికీ పర్యవేక్షణ కొరవడి ప్రజాపంపిణీ వ్యవస్థ గాడి తప్పుతోందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లాలోని 11 మండలాల్లో 280 గ్రామపంచాయతీలు ఉండగా.. ఎఫ్ఎస్‌సీ కార్డులు 1,30,736, ఏఎఫ్ఎస్‌సీ కార్డులు 9401, ఏఏపీ కార్డులు 30 మొత్తం 1,40,217 ఉన్నాయి. వీరికి 323 రేషన్ దుకాణాల ద్వారా 298 డీలర్లు ప్రతి నెల సరుకులు పంపిణీ చేస్తున్నారు. లబ్ధిదారులందరూ 15వ తేది వరకు బియ్యం తీసుకునేందుకు గడువు ఉంటుంది. గతంలో తొమ్మిది రకాల నిత్యావసర సరుకులు అందజేస్తుండగా.. ప్రస్తుతం బియ్యం మాత్రమే ఇస్తున్నారు. బియ్యం పంపిణీలో ఏమైన సమస్యలుంటే విజిలెన్స్ కమిటీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తుంది.

ప్రతి మూడునెలలకు ఓసారి..

విజిలెన్స్ కమిటీ ప్రతి మూడు నెలలకు ఓసారి సమావేశం కావాల్సి ఉంటుంది. రేషన్ బియ్యం నాణ్యత, పంపిణీ తీరు, మధ్యాహ్న భోజనం, అంగన్‌వాడీల్లో పౌష్టికాహారంపై చర్చించాలి. లోపాలుంటే ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది. ఎంతో సదుద్దేశంతో అమలులోకి తీసుకొచ్చిన విజిలెన్స్ కమిటీల నిర్వహణ జిల్లాలో నామమాత్రంగానే మారింది. ఏడాది కిందట సమావేశాలు నిర్వహించగా ఆ తర్వాత వాటి ఊసేలేదు.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేదెలా?

క్షేత్రస్థాయిలో విజిలెన్స్ కమిటీల పర్యవేక్షణ లేకపోవడంతో నాణ్యత ప్రశ్నార్థకంగా మారిందన్న ఆరోపణలున్నాయి. ఒకే దేశం.. ఒకే రేషన్ విధానం అమలులో ఉన్నా ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన వారికి రేషన్ బియ్యం అందడం లేదు. మధ్యాహ్న భోజనం, అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం గురించి ప్రశ్నించే వారు కరువయ్యారు. క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహిస్తే సభ్యులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందుకు ఆసక్తి చూపుతారు. సమావేశాలు లేకపోవడంతో సమస్యలు గుర్తించినా ప్రయోజనం ఉండటం లేదు. క్షేత్రస్థాయిలో పరిశీలన జాడేలేదు. మూడు నెలలకు ఓసారి విజిలెన్స్ కమిటీ సమావేశాలు ఏర్పాటు చేస్తే సమస్యలు కొంత వరకైనా తీరే అవకాశం ఉంటుంది.



మరికల్‌లో రేషన్ దుకాణం వద్ద వరుసలో నిలబడ్డ లబ్ధిదారులు (ఫైల్)

మండలాల వారీగా రేషన్‌కార్డుల వివరాలు

మండలం	ఎఫ్ఎస్‌సీ	ఏఎఫ్ఎస్‌సీ	ఏఏపీ
నారాయణపేట	20,777	1,750	15
మక్తల్	16,983	1,275	1
మద్దూర్	16,080	1,192	2
కోస్గి	14,028	927	-
ఊట్కూర్	12,420	856	1
దామరగిద్ద	11,893	1,063	1
మరికల్	9,047	367	2
నర్వ	8,530	393	8
ధన్వాడ	8,165	876	-
కృష్ణా	6,578	418	-
మాగనూర్	6,285	284	-

> **కమిటీల పనితీరు మెరుగుపరుస్తాం..**
>
> 
>
> మండల, డివిజన్, జిల్లాస్థాయిలో ఉన్న విజిలెన్స్ కమిటీలు పూర్తిస్థాయిలో పర్యవేక్షించేలా పనితీరును మెరుగుపరుస్తాం. ప్రజాపంపిణీ ద్వారా రేషన్ బియ్యం లబ్ధిదారులకు సవ్యంగా అందించేందుకు చర్యలు చేపడతాం.
>
> – సుదర్శన్, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి

క్లుప్తంగా

హైవే గ్రిల్స్ కడ్డీ గుచ్చుకొని వ్యక్తి మృతి



ఎర్రవల్లి: ప్రమాదవశాత్తు హైవే గ్రిల్స్ కడ్డీ గుచ్చుకొని వ్యక్తి మృతి చెందిన ఘటన ఇటిక్యాల పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకటేష్ కథనం మేరకు.. కొత్త కోట మండల కేంద్రానికి చెందిన కోస్గి కృష్ణారెడ్డి (68) పని నిమిత్తం ఎర్రవల్లికి వచ్చాడు. ఈ క్రమంలో గ్రామ బస్టాప్ సమీపంలో హైవే గ్రిల్స్ పక్కన మూత్ర విసర్జనకు వెళ్లి ప్రమాదవశాత్తు గ్రిల్స్‌పై బోర్లా పడ్డాడు. ఇనుప కడ్డీ నోట్లో బలంగా గుచ్చుకోవడంతో తీవ్ర రక్తస్రావం జరిగి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా పోస్టుమార్టం నిమిత్తం గద్వాలకు తరలించారు. కృష్ణారెడ్డి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

రైలు కిందపడి వ్యక్తి బలవన్మరణం

మహబూబ్‌నగర్ క్రైం: కంటిచూపు సక్రమంగా పని చేయకపోవడం.. ఏ పని చేయలేక జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే ఎస్‌ఐ సయ్యద్ అక్బర్ కథనం మేరకు.. జిల్లా కేంద్రంలోని అప్పన్నపల్లికి చెందిన ఈడిగి వెంకటయ్యగౌడ్ (38) మంగళవారం గ్రామ సమీపంలో గుర్తుతెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి కొన్ని రోజులుగా కంటిచూపు మందగించడంతో, ఏ పని చేయలేక పోతున్నాడు. గ్రామంలో భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. దీంతో జీవితంపై విరక్తిచెంది రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

జీతాలివ్వండి.. మహాప్రభో



కల్వకుర్తిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల

- గెస్ట్ లెక్చరర్లకు ఐదు నెలలుగా అందని వేతనాలు
- పండుగ పూట తప్పని పస్తులు

కల్వకుర్తి రూరల్: ఇంటర్మీడియట్ అకాడమిక్ సంవత్సరం ప్రారంభమై 5 నెలలు గడుస్తోంది. అయితే ఈ విద్యా సంవత్సరం మొదటి నుంచి ఒక్క నెల జీతం కూడా రాకపోవడంతో గెస్ట్ లెక్చరర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత విద్యా సంవత్సరం మార్చి వరకు విద్యా బోధన అనంతరం ఈ సంవత్సరం జూన్‌లో ఇంటర్ బోర్డు గెస్ట్ లెక్చరర్లకు రెన్యువల్ ఇచ్చింది. అయితే వీరికి సంబంధించి జీతాలు రాకపోవడంతో తమ కుటుంబాలను పోషించుకునేది ఎలా అని ఆవేదన చెందుతున్నారు.

త్రీమెన్ కమిటీ ద్వారా..

2017లో కలెక్టర్ చైర్మన్‌గా ఏర్పాటు చేసిన త్రీమెన్ కమిటీ ద్వారా ఇంటర్ విద్య బోధించేందుకు గెస్ట్ లెక్చరర్లను నియమించారు. పీజీలో మార్కుల శాతం, డెమో, ఇంటర్వ్యూలు నిర్వహించి ఆయా కళాశాలల్లో ఖాళీగా ఉన్న సబ్జెక్ట్‌లో అతిథి అధ్యాపకులను నియమించింది. నెలకు 72 పీరియడ్లు తగ్గకుండా రూ.28 వేల వేతనం చెల్లిస్తారు. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమై 5 నెలలు గడుస్తున్నాయి. వరుసగా బతుకమ్మ, దసరా, దీపావళి పండుగలు సమీపిస్తున్నా వేతనాలు రాకపోవడంతో గెస్ట్ లెక్చరర్లు పస్తులతో కాలం గడపాల్సి వస్తోంది.



నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న గెస్ట్ లెక్చరర్లు (ఫైల్)

ఉమ్మడి జిల్లా పరిధిలో..

రాష్ట్రవ్యాప్తంగా 405 కళాశాలలు ఉండగా 1,654 మంది గెస్ట్ లెక్చరర్లు పనిచేస్తున్నారు. ఇందులో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 58 కళాశాలల్లో 283 మంది గెస్ట్ లెక్చరర్లు ఉన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని 15 కళాశాలల్లో 73 మంది అతిథి అధ్యాపకులు పనిచేస్తున్నారు.

వినతుల అందజేత

అతిథి అధ్యాపకులకు వేతనాలు విడుదలయ్యేలా చూడాలంటూ సంఘం ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంతోపాటు పలువురు ప్రజాప్రతినిధులు, ఇంటర్ బోర్డు అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

ఒకేషనల్ అధ్యాపకుల వెట్టిచాకిరి

జనరల్ సబ్జెక్ట్‌ల్లో అధ్యాపకుల మాదిరిగానే ఇంటర్ బోర్డు గెస్ట్ లెక్చరర్లను నియమించింది. ఫస్ట్ ఇయర్ ఒకరు, సెకండ్ ఇయర్ ఒకరి చొప్పున ఒక్కో ఒకేషనల్ గ్రూప్‌నకు ఇద్దరు గెస్ట్ లెక్చరర్లు పనిచేస్తారు. గతేడాది ఇంటర్ బోర్డు ఒకేషనల్ గ్రూపునకు సెకండ్ పోస్టు తొలగించింది. ఒకేషనల్ గ్రూపులో రెండేళ్లకు కలిపి ఆరు ఆప్షనల్ సబ్జెక్ట్‌లు ఉంటాయి. వీటన్నింటిని ఒకే అధ్యాపకుడు బోధించాల్సి వస్తుంది. ఈ సంవత్సరం కూడా దీనిపై బోర్డు ఎలాంటి నియామకాలు చేపట్టలేదు. దీంతో ఒకేషనల్ అధ్యాపకులు ఉదయం నుంచి సాయంత్రం వరకు 6 పీరియడ్లు బోధిస్తూ వెట్టి చాకిరి చేస్తున్నారు. దీనికితోడు బయోమెట్రిక్ విధానం అమలు చేయడంతో ఉదయం నుంచి సాయంత్ర వరకు కళాశాలలో ఉంటూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల అభివృద్ధికి పాటుపడుతున్నారు.

వేతనాలు ఇవ్వాలి



గెస్ట్ లెక్చరర్లకు సంబంధించి 5 నెలల వేతనాలు వెంటనే చెల్లించాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి. పండుగ పూట పస్తులు ఉండకుండా చూడాలి. ఎన్నికల ముందు, ఎన్నికల తర్వాత గెస్ట్ లెక్చరర్లకు ఇచ్చిన హామీలను నిలుపుకోవాలి. ఇంటర్ బోర్డు అధికారులు పట్టించుకోకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జీతాలు విడుదల చేయాలి.

– సదానందంగౌడ్,
గెస్ట్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి

జేఎల్ ఫలితాలు విడుదల

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కాంట్రాక్ట్ లెక్చరర్‌లను గత ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసింది. వీరి తర్వాత పనిచేసేది గెస్ట్ లెక్చరర్‌లే. గెస్ట్ లెక్చరర్లను దశాబ్దకాలంగా ప్రభుత్వం ఏడాదికి 10 నెలల వేతనం మాత్రమే చెల్లిస్తూ వారిని రెన్యువల్ చేస్తూ వస్తుంది. ఈసారి కూడా అదే ఆశతో గెస్ట్ లెక్చరర్లు ఉన్నారు. అయితే ఉద్యోగాల భర్తీలో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న జూనియర్ లెక్చరర్ల పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసి ఫలితాలు కూడా ప్రకటించగా.. నియామకాలు చేపట్టలేదు. కొత్తగా చేరే లెక్చరర్లు ప్రస్తుతం గెస్ట్ లెక్చరర్ల స్థానాల్లో పనిచేయాల్సి ఉంటుంది. అయితే తమకు ఇప్పటి వరకైనా వేతనాలు చెల్లించాలని అతిథి అధ్యాపకులు కోరుతున్నారు.

పోస్టల్ సిబ్బంది నిర్లక్ష్యం నిరుద్యోగికి శాపం

- ఇంటర్వ్యూ తేదీ తరువాత 9 రోజులకు లెటర్ అందజేసిన వైనం
- ఉద్యోగ అవకాశం కోల్పోయిన యువకుడు



ఆలస్యంగా తనకు చేరిన ఇంటర్వ్యూ లేఖను చూపుతున్న నాగరాజు

జడ్చర్ల టౌన్: పోస్టల్ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఓ నిరుద్యోగి ఉద్యోగ అవకాశం కోల్పోయిన ఘటన జడ్చర్ల మండల పరిధిలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. బాధితుడి కథనం ప్రకారం.. గంగాపురం గ్రామానికి చెందిన నాగరాజు తెలంగాణ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్‌లో ఆఫీస్ సబార్డినేట్ ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకున్నాడు. ప్రక్రియ అంతా పూర్తయి సెప్టెంబర్ 27న ఇంటర్వ్యూకు హాజరు కావాలని అతడికి సదరు కమిషన్ నుంచి గతనెల 12న స్పీడ్ పోస్టు ద్వారా లేఖ పంపించారు. అయితే పోస్టల్ సిబ్బంది సదరు లేఖను ఈనెల 5న అభ్యర్థి బాబాయ్ జంగయ్యకు ఇచ్చి చేతులు దులుపుకొన్నారు. కాగా ఏదో లెటర్ వచ్చిందని అదే రోజు సాయంత్రం అభ్యర్థికి జంగయ్య అందించగా.. అది ఇంటర్వ్యూ లెటర్ అని గుర్తించిన నాగరాజు సమయం దాటిపోయిందని గ్రహించి ఆవేదన చెందాడు. గ్రామంలోని బీపీఎం వరప్రసాద్‌ను విషయంపై ప్రశ్నించగా తనకేం తెలియదంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చినట్లు వివరించారు. అయినప్పటికీ లెటర్‌ను తీసుకుని సోమవారం హైదరాబాద్‌లో కమిషన్ కార్యాలయానికి వెళ్లి విషయం వివరించగా.. తామేమి చేయలేమని వేరొకరికి ఉద్యోగం ఇచ్చామని చెప్పారని వాపోయాడు. ఏం చేయాలో తెలియక ఇంటికి చేరుకున్నాడు. మంగళవారం విషయం తెలుసుకున్న అతడి బంధుమిత్రులు బీపీఎంను నిలదీశారు.



బాదేపల్లి పోస్టాఫీస్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న నాగరాజు, బంధుమిత్రులు

సరైన సమాధానం ఇవ్వకపోడంతో బాదేపల్లి పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రవికుమార్‌ను ఆశ్రయించారు. లెటర్ ఆలస్యంగా ఇవ్వటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఆయన బాధ్యులపై చర్యలు తీసుకుంటానని.. ఉన్నతాధికారులకు విషయం తెలియజేస్తానని బదులిచ్చారు. విషయంపై బాధితుడు జడ్చర్ల పోలీసులను ఆశ్రయించారు.

అసలు ఏం జరిగింది?

గతనెల 12న కమిషన్ నుంచి స్పీడ్‌పోస్టులో లెటర్ బుకింగ్ చేసి పంపించారు. ఆ లెటర్ బాదేపల్లి పోస్టాఫీసు ద్వారా కావేరమ్మపేట బ్రాంచ్‌కు అక్కడి నుంచి సెప్టెంబర్ 18న గంగాపురం గ్రామానికి చేరింది. అప్పటికీ విధుల్లో ఉన్న ఏబీపీఎం శ్రీకర్ ఆ లెటర్‌ను బట్వాడా చేయాల్సి ఉండగా ఇవ్వలేదు. సదరు ఏబీపీఎం అప్పటికే అనేక అవకతవకలకు పాల్పడటంతో అతడిని విధుల నుంచి తప్పించారు. దీంతో అతడు అదే నెల 24న పోస్టుకు రాజీనామా చేశారు. ఏబీపీఎం విధుల్లో లేనిచో బీపీఎం లెటర్లను డెలివరీ చేయాల్సి ఉంటుంది. కానీ బీపీఎం వరప్రసాద్ నిర్లక్ష్యం వహించాడని బాధితుడు అంటున్నారు. ఈనెల 5న గ్రామానికి చెందిన శ్రీనివాసులు అనే యువకుడి ద్వారా తన బాబాయికి లెటర్‌ను అందించారని చెబుతున్నాడు. కాగా రికార్డుల్లో మాత్రం 26న అన్నట్లుగా ట్రాకింగ్ ఉండటం గమనార్హం. కాగా తనది నిరుపేద కుటుంబమని.. తన తండ్రి నాగయ్య పదేళ్లక్రితం మృతి చెందగా తల్లి నాగమ్మ వ్యవసాయ పనులు చేస్తూ చదివించిందని నాగరాజు వాపోయడు. నాగరాజుకు న్యాయం చేయాలని స్థానికులు, బంధువులు డిమాండ్ చేస్తున్నారు.

పేకాట స్థావరంపై దాడి

రూ.6,35,600 నగదు స్వాధీనం

వనపర్తి: జిల్లా సరిహద్దులో గల పెబ్బేరు పోలీస్ స్టేషన్ రంగాపూర్ గ్రామ శివారులోని కృష్ణానది పక్కన ఓ గోదాంలో పేకాట శిబిరం నిర్వహిస్తున్నట్టు జిల్లా పోలీసులకు సమాచారం రావడంతో స్పెషనల్ సీసీఎస్ సీఐ రవిపాల్, పెబ్బేరు ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డిలు సిబ్బందితో కలిసి పేకాట స్థావరపై దాడి చేశారు. ఈ దాడిలో 15మందిని అదుపులోకి తీసుకోగా వారి నుండి రూ.6,35,600 నగదు, 4కార్లు, 4బైక్‌లు, 15మొబైల్స్ స్వాధీనం చేసుకున్నట్టు జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ తెలిపారు. మీ చుట్టు పక్కల పరిసర ప్రాంతాలలో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు అనుమానం కలిగిన ప్రజలు పోలీసులకు సమాచారం ఇచ్చి సహకరించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఎస్పీ తెలిపారు.



పేకాట స్థావర ంపై దాడి నిందితుల వివరాలను మీడియాకు వివరిస్తున్న ఎస్పీ రావుల గిరిధర్

ఎరువుల వాడకంలో జాగ్రత్తలు పాటించండి



పంట పొలంలో ఎరువులు చల్లుతున్న రైతు

పాడి పంట

అధికారి సలహా: వ్యవసాయశాఖ అధికారి సక్రియ నాయక్

అలంపూర్: నేలలో భూసారం మేరకు డీఏపీని (అడుగు మందు) దుక్కిలోనే వేయాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నట్లు ఇన్‌చార్జి జిల్లా వ్యవసాయశాఖ అధికారి సక్రియా నాయక్ తెలిపారు. ప్రస్తుత సీజన్‌లోనే డీఏపీని విత్తనాలు విత్తే విధంగానే దుక్కి ఎరువుగా వేసుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. ఇప్పటి వరకు రైతులు డీఏపీని దుక్కి మందుగా కొన్ని పంటలకు మాత్రమే వాడుతున్నారు. యాసంగి నేపథ్యంలో రైతులు వాడాల్సిన ఎరువులు, మోతాదుపై వ్యవసాయ శాస్త్రవేత్తలు అందిస్తున్న సూచనలు, సలహాలను వివరించారు.

మోతాదుకు మించి డీఏపీ..

ఈ ప్రాంత నేలల్లో బాస్వరం మధ్యస్థంగా, పొటాషియం ఎక్కువగా, నత్రజని తక్కువగా ఉన్నట్లు శాస్త్రవేత్తలు నిర్ధారించారు. ఇక్కడి నేల స్వభావం మేరకు పంట కాలంలో ఎకరాకు 50 కేజీల డీఏపీని వాడాలని శాస్త్రవేత్తలు చెబుతుండగా.. రైతులు ఎకరాకు 100 నుంచి 150 కేజీల వరకు వేస్తున్నట్లు గుర్తించారు. మరోవైపు ఈ మందును పైపాటుగా వేస్తునందున ఎలాంటి ప్రయోజనం లేకుండా పోతుందని వివరిస్తున్నారు.

వాడే మోతాదు..

భూసారం మేరకు వ్యవసాయ శాస్త్రవేత్తలు ఎరువుల మోతాదు ఉండాలని పేర్కొంటున్నారు. డీఏపీ ఎరువును ప్రతి ఎకరాకు 50 కిలోలు వాడాలి. దీన్ని తప్పనిసరిగా దుక్కి ఎరువుగానే వాడాలి. డీఏపీలో భాస్వరం ఎక్కువగా ఉన్నందున ఈ ఎరువును పైపాటుగా వేస్తే ఉపయోగకరంగా ఉండదు. పత్తి పంటకు విత్తు కంటే మూడు నుంచి నాలుగు అంగుళాల లోతులో డీఏపీ వేయాలి. మిగతా అన్ని పంటలకు ఎకరాకు 50 కిలోలు మాత్రమే వినియోగించాలి.

■ యూరియా ప్రతి ఎకరాకు వంద కిలోలు వాడాలి. ఈ ప్రాంతంలో నత్రజని శాతం తక్కువగా ఉన్నందున యూరియా మోతాదు ఎక్కువగా వాడాలి. యూరియాను పైపాటు ఎరువుగా వాడవచ్చు. పత్తికి యూరియాను పైపాటు ఎరువుగా వాడవచ్చు. పత్తి విత్తిన 20 రోజుల నుంచి ఐదుసార్లు వాడాలి. వాడిన ప్రతిసారి 30 కిలోల వరకు వేయవచ్చు. వరికి యూరియా నాలుగు సార్లు వాడాలి. కలుపు తీసే సమయంలో, ఆ తర్వాత 20 రోజులు, 30 రోజులు, 50 రోజులకు యూరియాను వరిపైరుకు వాడాల్సి ఉంటుంది.

శక్తిపీఠం.. భక్తజన సంద్రం



జోగుళాంబ అమ్మవారి దర్శనానికి క్యూ కట్టిన భక్తులు

- కాత్యాయనీ రూపంలో దర్శనమిచ్చిన అమ్మవారు
- వైభవంగా కొనసాగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలు

జోగుళాంబ శక్తిపీఠం: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అలంపూర్ జోగుళాంబ అమ్మవారు మంగళవారం కాత్యాయనీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రదోశకాలంలో దర్బార్ సేవలు నిర్వహించారు. పండితులు చతుర్వేద పారాయణాలు, మంగళాష్టకాలు, చూర్ణికలు పఠించారు. దశవిధ హారతులు అందజేసి, భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేశారు. ఉత్సవాల్లో న్యాయమూర్తి కవిత పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ పురేందర్ కుమార్ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

■ రాష్ట్ర ప్రభుత్వం తరపున దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఏబీసీ కార్యదర్శి సంపత్ కుమార్‌తో కలిసి దేవస్థానానికి విచ్చేసిన మంత్రికి ఈఓ పురేందర్ కుమార్, చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, ప్రధాన అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ముందుగా వారు బాలబ్రహ్మేశ్వరుడికి ఏకవార రుద్రాభిషేకాలు చేశారు. అనంతరం జోగుళాంబ ఆలయానికి చేరుకుని శ్రీచక్రానికి కుంకుమార్చన నిర్వహించారు. అదేవిధంగా చండీ హోమాలలో పాల్గొని పూర్ణాహుతి సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఆనంద్ శర్మ వారికి క్షేత్ర ప్రాశస్త్యాన్ని వివరించారు. తీర్థప్రసాదాలు అందజేసి, వేద ఆశీర్వచనం చేశారు. దేవస్థానం ఈఓ మంత్రికి అమ్మవారి జ్ఞాపిక అందజేశారు. శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు మజ్జిగ, పిల్లలకు బాలామృతం ఏర్పాటుచేయాలని ఆలయ ఈఓను మంత్రి ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌జేసీ రామకృష్ణ, ఆలయ ధర్మకర్తలు పులేందర్, అడ్డాకుల రాము, నాగశిరోమణి, చంద్రశేఖర్‌రెడ్డి, డీఎస్పీ సత్యనారాయణ, సీఐ రవిబాబు, ఎస్‌ఐ వెంకటస్వామి పాల్గొన్నారు.

■ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాన్ని మహిళా అఘోర నాగసాధువు దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్, పాలకమండలి సభ్యులు నాగసాధువు ఆశీర్వాదం పొందారు. అనంతరం యాగశాలలో నిర్వహిస్తున్న చండీ హోమంలో నాగసాధువు పాల్గొని భక్తులను ఆశీర్వదించారు.

మహాలక్ష్మీదేవిగా పర్వతాపూర్ మైసమ్మ

నవాబుపేట: దేవి శరన్నవరాత్రులను పురస్కరించుకుని మంగళవారం మండల పరిధిలోని మైసమ్మ ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా మహాలక్ష్మి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. మహిళలు కుంకుమార్చన చేశారు.





పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న మంత్రి కొండా సురేఖ



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

రేషన్ బియ్యం పట్టివేత



ఆత్మకూర్‌లో పట్టుబడిన రేషన్ బియ్యం వాహనం

ఆత్మకూర్: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యంను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నరేందర్, ఏఎస్‌ఐ బీచుపల్లి తెలిపారు. సోమవారం రాత్రి 11 గంటల సమయంలో స్థానిక గాంధీచౌక్‌లో వాహనాల తనిఖీ చేపట్టగా.. ఓ బొలెరో వాహనంలో రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. 10 క్వింటాళ్ల బియ్యం బస్తాలను, వాహనాన్ని స్వాధీనం చేసుకుని సివిల్‌సప్లయ్ అధికారులకు సమాచారం అందించి కేసున మోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈమేరకు డీటీ నందకిషోర్ ఆధ్వర్యంలో పంచనామా నిర్వహించినట్లు వివరించారు.

సారంబండ తండాలో..

చారకొండ: సారంబండ తండాలో బొలెరో వాహనంలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎస్‌ఐ వెంకట్ రెడ్డి తన సిబ్బందితో కలిసి బియ్యం తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నారు. పట్టుబడిన వాహనంలో 30 క్వింటాళ్ల బియ్యం ఉన్నట్లు తెలిపారు. వాహనం స్టేషన్‌కు తరలించి డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

మాందాపూర్‌లో 8 క్వింటాళ్లు..

పాన్‌గల్: మండలంలోని మాందాపూర్ సమీపంలో 8 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అక్రమంగా ఆటోలో తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. జోగుళాంబ గద్వాల జిల్లా జమ్మిచేడు వీరాపురం గ్రామానికి చెందిన రాజు పలు గ్రామాల్లో రేషన్ బియ్యాన్ని సేకరించి, కొల్లాపూర్ మండలం సింగోటంలోని ఓ రైస్ మిల్‌కు బియ్యం తరలిస్తుండగా, దాడిచేసి పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ వేణు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

డీజే సౌండ్ తెచ్చిన తంట

- ఆర్మీ జవాన్‌పై కత్తితో దాడి

ధరూరు : ఆర్మీ జవాన్‌పై ఓ వ్యక్తి దాడిచేసిన ఘటన రేవులపల్లిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సోమవారం రాత్రి జానకమ్మ కుటుంబం డీజే సౌండ్ సిస్టం ఏర్పాటు చేసుకుని బతుకమ్మ సంబరాలు నిర్వహించింది. ఆ సమయంలో గ్రామానికి చెందిన కృష్ణవర్ధన్‌రెడ్డి సౌండ్ ఎక్కువగా ఉందని తగ్గించాలని.. లేదంటే ఆపేయాలని అభ్యంతరం వ్యక్తం చేశాడు. ఈ విషయంలో జానకి కుటుంబ సభ్యులు, కృష్ణవర్ధన్‌రెడ్డి కుటుంబ సభ్యుల మధ్య జరిగిన వాదన గొడవకు దారితీసింది. అదే సమయంలో అక్కడికి చేరుకున్న జానకి అల్లుడు మునివర్ధన్‌పై కత్తితో దాడి చేశారు. మునివర్ధన్ ఆర్మీ జవాన్‌గా పని చేస్తూ ఇటీవలే సెలవుపై ఇంటికి వచ్చాడు. రక్త గాయాలు కావడంతో అతడిని గద్వాలలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఆర్మీ హాస్పిటల్‌కు తరలించారు. జానకి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి కృష్ణవర్ధన్‌రెడ్డిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ షకూర్ తెలిపారు.

11 యూనిట్లలో విద్యుదుత్పత్తి



లిఫ్టు-1 గుడ్డెందొడ్డి వద్ద కొనసాగుతున్న నెట్టెంపాడు ఎత్తిపోతల నీటి పంపింగ్

ధరూరు/ఆత్మకూరు : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు మంగళవారం రాత్రి 8 గంటల వరకు 33,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. తెరిచి ఉంచిన ప్రాజెక్టు 1 క్రస్టు గేట్లను మంగళవారం ఉదయం మూసివేసినట్లు వివరించారు. ఎగువ, దిగువ కేంద్రాల్లోని 11 యూనిట్లలో విద్యుత్ ఉత్పత్తి చేపట్టినట్లు ఎస్‌ఈ సూరిబాబు తెలిపారు. ఎగువలో 5 యూనిట్ల ద్వారా 196 మెగావాట్లు, 245.405 ఎంయూ, దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు, 222.684 ఎంయూ ఉత్పత్తిని చేపట్టామన్నారు. ఇప్పటివరకు 468.089 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని సాధించామని వివరించారు.

ప్రాజెక్టు నుంచి మొత్తంగా వివిధ రూపాల్లో 41,839 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 9.193 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు.

శ్రీశైలంలో నీటిమట్టం 882.5 అడుగులు.

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో మంగళవారం నీటిమట్టం 882.5 అడుగుల వద్ద 202.0439 టిఎంసీల నీటి నిల్వ ఉంది. జూరాలలో, సుంకేసుల నుంచి 57,039 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలం జలాశయం వస్తున్నాయి. శ్రీశైలంలో భూగర్భ కేంద్రంలోనూ, ఏపీజెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలోనూ విద్యుత్ ఉత్పత్తి చేస్తూ మొత్తం 66,157 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గత 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 10,000 క్యూసెక్కులు, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,520, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకు 800 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 16.496 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేశారు. కుడిగట్టు కేంద్రంలో 8.079 మి.యూనిట్లు ఉత్పత్తి చేశారు.

సుంకేసులకు 20వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

రాజోళి: సుంకేసుల డ్యాం కు మంగళవారం ఎగువ నుంచి 20,365 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. ఎగువ నుంచి వచ్చిన ఇన్‌ఫ్లోలో 17,916 క్యూసెక్కులను 4 గేట్లను తెరిచి దిగువకు వదిలి, కేసీ కెనాల్‌కు 2,445 క్యూసెక్కులు వదిలినట్లు జేఈ రాజు పేర్కొన్నారు.

నవజాత శిశువు మృతిపై విచారణ



గద్వాల క్రైం: నవజాత శిశువు మృతిపై మంగళవారం జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారి సిద్దప్ప, ప్రోగ్రాం అధికారిణి ప్రసూణరాణిలు స్థానిక కేపీఎస్ ఆస్పత్రిలో విచారణ చేపట్టారు. గర్భిణి నాగరాణికి ఆస్పత్రి సిబ్బంది అందించిన వైద్యసేవలు, ప్రసవం సమయంలో అందించిన చికిత్స వివరాలను ఆస్పత్రి డాక్టర్ బిందుమాధవితో తెలుసుకున్నారు. అనంతరం ఓపీ రిజిస్టర్, ల్యాబ్ రిపోర్టులను పరిశీలించారు. నవజాత శిశువు మృతిపై రాష్ట్ర వైద్యారోగ్యశాఖ అధికారులకు నివేదిక సమర్పించనున్నట్లు తెలిపారు. వారి వెంట సిబ్బంది మధుసూదన్‌రెడ్డి, రామాంజనేయులు ఉన్నారు.

న్యూస్‌రీల్

ఇంట్లో చోరీ

అలంపూర్ రూరల్: ఎవరూ లేని ఇంట్లో దుండగులు చోరీ చేసి నగదు అపహరించిన సంఘటన అలంపూర్ పట్టణంలోని న్యూ ప్లాట్స్ కాలనీలో మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఎస్‌ఐ వెంకటస్వామి వివరాల ప్రకారం.. అలంపూర్ పట్టణంలోని ఫర్టిలైజర్ షాపు నడిపే మహేశ్వర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి సొంతూరు పైపాడు గ్రామానికి వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో దుండగులు చోరీకి పాల్పడ్డారు. షాపులో పనిచేసే వర్కర్ ఉదయం వచ్చి చూడగా ఇంటి తాళం తెరిచి ఉండడంతో మహేశ్వర్‌రెడ్డి సమాచారం అందించాడు. వెంటనే మహేశ్వర్‌రెడ్డి దంపతులు అక్కడి వచ్చారు. ఇంట్లో రూ.1.80 లక్షలు చోరీకి గురైనట్లు బాధితుడు ఫిర్యాదు చేశాడు. క్లూస్ టీం, పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

దైవచింతన అలవర్చుకోవాలి



నారాయణపేట: దైవచింతన అలవర్చుకున్నప్పుడే మానవ జన్మకు సార్థకత లభిస్తుందని.. బతుకమ్మ సంబరాలతో పాటు దసరా, దీపావళి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో శాంతియుతంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే డా. చిట్టెం పర్ణికారెడ్డి కోరారు. దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని బాహర్‌పేట తిరుమలగుట్ట వేంకటేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఆమె వెంట మున్సిపల్ చైర్మన్ గందె అనసూయ చంద్రకాంత్, కౌన్సిలర్లు విజయలక్ష్మి, నారాయణమ్మ, బీజేపీ రాష్ట్ర నాయకుడు నాగురావు నామాజీ, సత్యయాదవ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు మిర్చి వెంకటయ్య, మాజీ కౌన్సిలర్ గోపాల్ యాదవ్, అపుడేపల్లి రాము, బీకేఎస్ నాయకులు వెంకోబా, అనంత్‌రెడ్డి, బాలప్ప తదితరులు పాల్గొన్నారు.

బైరంకొండలో..
మండలంలోని బైరంకొండలో ప్రతిష్టించిన అమ్మవారిని ఎమ్మెల్యే పర్ణికారెడ్డి మంగళవారం రాత్రి దర్శించుకున్నారు. అనంతరం మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు.

కాసుల కుప్ప

దేవరకద్ర మార్కెట్‌కు ప్రతిఏటా పెరుగుతున్న ఆదాయం



దేవరకద్ర మార్కెట్‌లో సీజన్‌లో అమ్మకానికి వచ్చిన ధాన్యం

- ఏడాది పొడవునా ఉల్లిపాయల క్రయవిక్రయాలు
- మార్కెట్ కమీషన్, టోల్‌గేట్ ద్వారా సమకూరుతున్న డబ్బులు
- వసతుల మెరుగుపై దృష్టిసారిస్తే మేలు

దేవరకద్ర: దేవరకద్ర మార్కెట్‌లో జరిగే లావాదేవీలతో ఆదాయం ప్రతి ఏటా పెరుగుతోంది. మార్కెట్‌లో ఏడాదికి రెండు సీజన్లలో జరిగే లావాదేవీలతోపాటు టోల్‌గేట్ ద్వారా ఆదాయం సమకూరుతోంది. మార్కెట్‌లో యాసంగి, వానాకాలం సీజన్‌లలో పండించిన వరిధాన్యం, ఆముదాలు, కందులు, వేరుశనగతోపాటు ప్రతి బుధవారం జరిగే ఉల్లి వేలం ద్వారా రూ.176 కోట్ల మేర క్రయవిక్రయాలు సాగాయి. ఇక్కడ మార్కెట్ ప్రారంభమైనప్పటి నుంచి వచ్చిన ఆదాయాలను పరిశీలిస్తే ప్రస్తుతం వచ్చిన ఆదాయమే రికార్డుగా చెప్పవచ్చు.

సీజన్‌లోనే ధాన్యం అమ్మకాలు..
దేవరకద్ర మార్కెట్‌కు యాసంగి, వానాకాలం సీజన్‌ల వారీగా వరిధాన్యం రైతులు అమ్మకానికి తెస్తారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన తర్వాత ఎక్కడికక్కడ కొనుగోలు చేస్తుండటంతో మార్కెట్‌కు వచ్చే ధాన్యం కొద్దిమేర తగ్గింది. అయితే అప్పటికప్పుడు డబ్బులు కావాల్సిన రైతులు పెద్ద మొత్తంలో మార్కెట్‌కు ధాన్యం అమ్మకానికి తెస్తారు. వానాకాలం పంటల దిగుబడి తర్వాత నవంబర్, డిసెంబర్‌లో మార్కెట్‌కు ప్రతిరోజు వేలాది బస్తాల ధాన్యం అమ్మకానికి వస్తుంది. ఇక యాసంగి సీజన్‌లో పండిన ధాన్యం మే, జూన్ నెలల్లో విక్రయాలు సాగుతాయి.

ఉల్లికి కేరాఫ్ అండ్రస్‌గా..
దేవరకద్ర మార్కెట్‌లో ఉల్లి విక్రయాలు ఏడాది పొడవునా సాగుతాయి. ఉల్లి కొనుగోళ్ల కోసం మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి జిల్లాల నుంచి వ్యాపారులు, వినియోగదారులు ఇక్కడికి వస్తారు. ఉమ్మడి జిల్లాలోనే ఉల్లి విక్రయాలకు కేరాఫ్ అడ్రస్‌గా దేవరకద్ర మార్కెట్ నిలిచింది. మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో రైతులు పండించిన ఉల్లిని ఎక్కువగా దేవరకద్ర మార్కెట్‌కు అమ్మకానికి తెస్తారు. ప్రతి బుధవారం మార్కెట్‌లో ప్రత్యేకంగా బహిరంగ వేలం ద్వారా ఉల్లిపాయల క్రయవిక్రయాలు సాగుతాయి. మార్కెట్‌లో టెండర్ల ప్రక్రియను ఉల్లికి మినహాయించారు. ఇక స్థానిక ట్రేడర్స్‌తోపాటు ఇతర మార్కెట్‌లకు చెందినవారు, చిరు వ్యాపారులు వచ్చి వేలం ద్వారా ఉల్లిని కొనుగోలు చేయడానికి నిబంధనలు సడలించారు. 6 నెలల పాటు ఉల్లి సీజన్‌లో మార్కెట్ కిటకిటలాడితే.. మిగతా ఆరు నెలలు అన్ సీజన్ అయినప్పటికీ ఉల్లి వేలం జరుగుతుంది.

దేవరకద్ర మార్కెట్‌కు ఆరేళ్లలో వచ్చిన ఆదాయ వివరాలు..

సంవత్సరం	ఆదాయ లక్ష్యం (రూ.లక్షల్లో..)	వచ్చిన ఆదాయం (రూ.లక్షల్లో..)
2018-19	65.00	66.16
2019-20	66.15	123.46
2020-21	74.28	121.26
2021-22	123.00	51.33
2022-23	192.00	167.62
2023-24	183.00	236.26
2024-25 (ఆగస్టు వరకు)	230.83	34.64

చర్యలు తీసుకుంటాం..



మార్కెట్ ఆదాయం పెంచడానికి కృషి చేస్తున్నాం. లావాదేవీల వల్ల వచ్చే ఆదాయంతోపాటు టోల్‌గేట్ ద్వారా మార్కెట్‌కు ఆదాయం సమకూరుతోంది. అలాగే దేవరకద్ర మార్కెట్ పరిధిలో బల్సుపల్లి వద్ద 5 వేల మె.ట., గోదాంలు, బండర్‌పల్లి సమీపంలో 5 వేల మె.ట., గోదాంలు ఉన్నాయి. మార్కెట్ యార్డులో ఉన్న గోదాంల వల్ల కూడా ఆదాయం సమకూరుతుంది. మార్కెట్‌లో రైతుల కోసం సౌకర్యాలు మెరుగుపరుస్తాం. అలాగే పందుల బెడద నివారణ కోసం తగిన చర్యలు తీసుకుంటాం.

– జయలక్ష్మి, మార్కెట్ కార్యదర్శి, దేవరకద్ర

రైతుల సౌకర్యార్థం..

మార్కెట్‌లో వసతులు మరింత మెరుగుపర్చాల్సిన అవసరం ఉంది. రైతుల కోసం గెస్ట్ హౌస్ ఏర్పాటు చేయాలి. మార్కెట్‌కు ధాన్యం తెచ్చిన రైతులు రాత్రివేళ మార్కెట్‌లోనే ఉండాల్సిన పరిస్థితులు వస్తుంటాయి. వసతి లేక ధాన్యం కుప్పలపైనే పడుకుంటారు. ఇక సేద తీరడానికి కూడా వసతులు సమకూర్చాల్సిన అవసరం ఉంది.

- మార్కెట్ యార్డుకు రోడ్డు పక్కనే షాపుల నిర్మాణం కోసం స్థలం ఉండగా షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు కోసం ప్రతిపాదనలు చేశారు. రెండేళ్ల క్రితమే రాష్ట్ర, జిల్లాస్థాయి మార్కెటింగ్ శాఖ అధికారులు షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటుపై పరిశీలించినా ఇప్పటి వరకు కొలిక్కిరాలేదు.
- మరోవైపు మార్కెట్‌లో వందలాది పందులు తిష్ట వేసుకుని ధాన్యంపై దాడులు చేస్తాయి. టెండర్ల ఆలస్యం కావడం, ఒకరోజు ముందుగానే మార్కెట్‌కు ధాన్యం తెచ్చే రైతులు రాత్రివేళ జాగారం చేయాల్సి వస్తోంది. పందుల నుంచి ధాన్యాన్ని కాపాడుకోవడానికి నానా ఇబ్బందులు పడుతుంటారు. ఈ విషయంలో మార్కెట్ అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

గుర్తుతెలియని వృద్ధురాలి మృతి

లింగాల: మండల కేంద్రంలోని ఏకలవ్య చౌరస్తాలో మంగళవారం గుర్తుతెలియని వృద్ధురాలు (60) మృతిచెందింది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు, పంచాయతీ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని వృద్ధురాలి మృతదేహాన్ని అచ్చంపేట మార్చురీకి తరలించారు. వృద్ధురాలికి సంబంధించిన వ్యక్తులు తమను సంప్రదించాలని ఎస్‌ఐ జగన్మోహన్ తెలిపారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి



ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్

వంగూరు: దసరా పండగ రోజున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన స్వగ్రామమైన వంగూరు మండలం కొండారెడ్డిపల్లికి వస్తున్నందున అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. మంగళవారం కొండారెడ్డిపల్లిలో ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, ఎమ్మెల్యే వంశీకృష్ణ, సీఎం సోదరుడు కృష్ణారెడ్డి తదితరులతో కలిసి ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కొండారెడ్డిపల్లిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తారన్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి హోదాలో మొదటిసారిగా స్వగ్రామానికి వస్తున్న రేవంత్‌రెడ్డికి ఘనస్వాగతం పలకాలని కోరారు. ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని అన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కేపీఎస్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్‌లో మహిళా జట్టుకు మూడోస్థానం



పాలమూరు మహిళల బాస్కెట్‌బాల్ జట్టు

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లో మంగళవారం ముగిసిన రాష్ట్రస్థాయి సీనియర్ మహిళా బాస్కెట్‌బాల్ టోర్నీలో ఉమ్మడి జిల్లా మహిళా జట్టు తృతీయస్థానంలో నిలిచింది. మూడోస్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో జిల్లా జట్టు 54–44 పాయింట్ల తేడాతో వికారాబాద్ జట్టుపై విజయం సాధించింది. ఈ సందర్భంగా జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మక్సూద్ బిన్ అహ్మద్ జాకీర్, నసరుల్లా హైదర్, సభ్యులు మీర్ ఖాలెద్‌అలీ, మహ్మద్ ఇలియాజ్, సుభాన్‌జీ, ముకర్రం, శ్రీకాంత్ హర్షం వ్యక్తం చేశారు.

కొనసాగుతున్న గాలింపు చర్యలు



అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు, అధికారులు

లింగాల: నల్లమల అటవీ ప్రాంతంలో గతనెల 28న అదృశ్యమైన చెంచు వ్యక్తి నిమ్మల శంకర్ ఆచూకీని గుర్తించేందుకు గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. ఇప్పటికే పోలీసులు, అటవీ శాఖ వారు చెంచులతో కలిసి గాలింపు చేపట్టారు. అటవీ ప్రాంతం దట్టంగా ఉండటంతో అదృశ్యమైన వ్యక్తి జాడ తెలియరాలేదు. మంగళవారం ఎస్‌ఐ జగన్మోహన్ ఆధ్వర్యంలో పోలీసులు, అటవీ, రెవెన్యూ సిబ్బంది చెంచులతో కలిసి 40 మంది ఆరు బృందాలుగా ఏర్పడి.. డ్రోన్ సహాయంలో అడవిలోని లోతట్టు ప్రాంతాన్ని జల్లెడ పట్టారు. అయినప్పటికీ ఆ వ్యక్తి ఆచూకీ లభ్యం కాలేదు. కాగా, 12 రోజులుగా కనిపించకుండా పోయిన వ్యక్తి బతికి ఉండే అవకాశాలు తక్కువేనని చెంచులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీసం వ్యక్తి ఆనవాళ్లు కూడా దొరకని పరిస్థితి నెలకొంది.

భవిత

మేటి ఇన్‌స్టిట్యూట్స్.. తగ్గిన ఆఫర్లు

ఐఐటీలు, ఐఐఎంలు.. ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్ విద్యకు ప్రసిద్ధ విద్యాసంస్థలు! వీటిలో చేరి కోర్సు పూర్తి చేసుకుంటే.. కార్పొరేట్ కొలువులు, కళ్లు చెదిరే వేతనాలు ఖాయమనే అభిప్రాయం! రూ.లక్షలు, వీలైతే కోట్లలో వార్షిక వేతనాలతో కొలువు సొంతం చేసుకోవచ్చనే అభిలాష!! కానీ.. ఈ ఏడాది (2023-24) ఐఐటీలు, ఐఐఎంల విద్యార్థులకు కొంత భిన్నమైన అనుభవాలు ఎదురయ్యాయి. ఐఐఎంల్లో ఆఫర్లు 'ఒకే' అనిపించేలా ఉన్నా.. ఐఐటీల్లో మాత్రం బాగానే తగ్గుదల కనిపించింది!! ఈ నేపథ్యంలో.. 2023-24 బ్యాచ్‌లో ఐఐటీలు, ఐఐఎంల్లో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ట్రెండ్స్‌పై కథనం..

- ప్లేస్‌మెంట్స్‌పై అంతర్జాయ పరిణామాలు, ఏఐ ప్రభావం
- గతంతో పోల్చితే తక్కువగానే ఆఫర్లు, వేతనాలు
- డేటా అనలిస్ట్‌లు, కోడింగ్‌కు పెరిగిన డిమాండ్

ఐఐటీల్లో 2024 బ్యాచ్ క్యాంపస్ ఆఫర్లలో తగ్గుదల కనిపించింది. తాజా గణాంకాలను పరిశీలిస్తే.. 30 శాతం మంది విద్యార్థులకు ఇంకా ఆఫర్లు అందాల్సి ఉంది. మొత్తం 23 ఐఐటీల్లో మొత్తం 21,500 మంది క్యాంపస్ డ్రైవ్స్‌కు దరఖాస్తు చేసుకోగా.. వారి లో 6,500 మంది ఆఫర్ల కోసం నిరీక్షిస్తున్నట్లు సమాచారం.

అంతర్జాతీయ పరిస్థితులు

ఐఐటీల్లో క్యాంపస్ డ్రైవ్స్‌లో తగ్గుదలకు ప్రస్తుతం అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితులు కారణమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా పలు దేశా ల్లో ఆర్థిక మందగమనం, అమెరికా ఎన్నికలు, ఉక్రెయిన్-రష్యా యుద్ధం, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తదితర కారణాలతో సంస్థలు నూతన నియామకాల విషయంలో వేచి చూసే ధోరణి అవలంభిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ఐఐటీల్లో ఇంటర్నేషనల్ ఆఫర్స్‌పై ఈ ప్రభావం ఎక్కువగానే పడినట్లు చెబుతున్నారు.

ఏఐ, చాట్ జీపీటీ ఎఫెక్ట్

ఐఐటీల్లో క్యాంపస్ డ్రైవ్స్‌పై ఏఐ, చాట్ జీపీటీ ప్రభావం సైతం పడిందనే వాదన వినిపిస్తోంది. చాట్ జీపీటీ, ఏఐ టూల్స్, జెన్ ఏఐ వంటి సాంకేతికతల కారణంగా.. ముగ్గురు చేసే పనిని ఇద్దరు పూర్తి చేస్తున్నారు. దీంతో సహజంగానే నియామకాల్లో 20 నుంచి 30 శాతం మేరకు కోత పడిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

జాబ్ రెడీ స్కిల్స్

ఐఐటీల్లో ఆఫర్లు తగ్గడానికి జాబ్ రెడీ స్కిల్స్ లేమి కూడా కారణమని చెబుతున్నారు. విద్యార్థుల్లో ఉద్యోగ నైపుణ్యాలు 80 శాతం మేరకే ఉంటున్నాయని పేర్కొంటున్నారు. విద్యార్థులు ఇంటర్న్‌షిప్ సమయంలో కోర్ నైపుణ్యాలకే ప్రాధాన్యమిస్తున్నారని.. రియల్ టైమ్ ఎక్స్‌పోజర్‌పై దృష్టి పెట్టడం లేదని, ఇదే జాబ్ రెడీ స్కిల్స్ కొరతకు కారణమవుతోందని అంటున్నారు.



డిమాండింగ్ జాబ్ ప్రొఫైల్స్

ఐఐటీ క్యాంపస్ డ్రైవ్స్‌లో జాబ్ ప్రొఫైల్స్‌ను పరిశీలిస్తే.. కోర్ ఇంజనీరింగ్, సాఫ్ట్‌వేర్ డెవలపర్స్ అండ్ ప్రోగ్రామర్స్, డేటా అనలిస్ట్స్, యుఎక్స్ డిజైనర్, ప్రొడక్ట్ డిజైనర్, ఫుల్‌స్టాక్ ఇంజనీర్ జాబ్ ప్రొఫైల్స్‌లో అత్యధిక సంఖ్యలో నియామకాలు జరిగాయి.

డేటా అనలిస్ట్‌లకు డిమాండ్

కన్సల్టింగ్, ఫైనాన్షియల్ రంగంలోని సంస్థలు డేటా అనలిస్ట్‌ల నియామకాలు ఎక్కువగా చేపట్టాయి. బీఎఫ్‌ఎస్‌ఐ, కన్సల్టింగ్ సంస్థలు.. క్లయింట్స్‌ను, వినియోగదారులను పెంచుకునే ప్రయత్నాల్లో ఉన్నాయి. అందుకే డేటా అనలిస్ట్‌లను ఎక్కువగా నియమించుకుంటున్నాయి. అదేవిధంగా కోడింగ్ స్కిల్స్‌కు కూడా డిమాండ్ అధికంగా కనిపించింది. ఐటీ మొదలు ఆన్‌లైన్ టెక్నాలజీస్ ఆధారంగా సేవలందిస్తున్న సంస్థల వరకూ.. అన్ని కంపెనీలు సాఫ్ట్‌వేర్స్, ప్రోగ్రామింగ్, డిజైనింగ్‌కు ప్రాధాన్యమిస్తుండటమే ఇందుకు కారణం.

టాప్ రిక్రూటర్స్ వీరే

ఐఐటీల్లో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో.. క్వాల్‌కామ్, టెక్సాస్ ఇన్‌స్ట్రుమెంట్స్, గూగుల్, బార్‌క్లేస్, ఎస్‌ఏపీ ల్యాబ్స్, సిటీ బ్యాంక్, వెల్ ఫార్గో, మైక్రోసాఫ్ట్, బీసీజీ, బెయిన్ అండ్ కో సంస్థలు అంతర్జాతీయ ఆఫర్స్ అందించడంలో ముందంజలో ఉన్నాయి. డొమెస్టిక్ ఆఫర్స్ విషయంలో ఉబెర్, హనీవెల్, మైక్రాన్ టెక్నాలజీ, ఓఎన్‌జీసీ, ఫ్లిప్‌కార్ట్, బజాజ్ ఆటో, టాటా స్టీల్, ఎస్‌టీఎం మైక్రో ఎలక్ట్రికల్స్ వంటి సంస్థలు ముందు వరుసలో ఉన్నాయి.

కోడింగ్ నైపుణ్యాలు తప్పనిసరి

ఐఐటీల క్యాంపస్ డ్రైవ్స్‌లో సంస్థలు విద్యార్థుల్లోని కోడింగ్ నైపుణ్యాలపైనే ప్రధానంగా దృష్టి పెట్టాయి. రిటెన్ టెస్ట్‌లు, టెక్నికల్ రౌండ్స్‌లో కోడింగ్ సంబంధిత స్కిల్స్‌ను ఎక్కువగా పరిశీలించాయని ప్లేస్‌మెంట్ వర్గాలు పేర్కొన్నాయి. కోర్ ఇంజనీరింగ్, సర్క్యూట్ బ్రాంచ్‌లకు సంబంధించి ఆయా విభాగాల్లోని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ నైపుణ్యాలను పరిశీలించాయని తెలిపారు.

ఐఐఎం క్యాంపస్‌లలో

దేశంలో మేనేజ్‌మెంట్ విద్యకు కేరాఫ్‌గా నిలిచే ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్ క్యాంపస్‌లలో ఈ ఏడాది ఆఫర్స్ ఆశావాహంగానే ఉన్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. మొత్తం 21 ఐఐఎం క్యాంపస్‌లలో 2023-24లో పీజీ మేనేజ్‌మెంట్ విద్యార్థులకు 90 శాతం మందికిపైగా ఆఫర్లు లభించాయి. ప్రముఖ ఐఐఎం క్యాంపస్‌లలో నూటికి నూరు శాతం విద్యార్థులకు ఆఫర్లు సొంతమయ్యాయి.

- ఐఐఎం- బెంగళూరు క్యాంపస్‌లో పీజీపీ విద్యార్థులకు సగటున రూ.32.5 లక్షల వార్షిక వేతనంతో ఆఫర్లు లభించాయి.
- ఐఐఎం అహ్మదాబాద్‌లో 100 శాతం ప్లేస్‌మెంట్స్ నమోదయ్యాయి. ఈ క్యాంపస్‌లో సగటు వార్షిక వేతనం రూ.35 లక్షలుగా ఉండడం గమనార్హం.
- ఐఐఎం-కోల్‌కతలో కూడా 100 శాతం ప్లేస్‌మెంట్స్ లభించాయి.
- ఐఐఎం-లక్నోలో సగటు వేతనం రూ.30 లక్షలుగా నమోదైంది.
- ఐఐఎం-ఇండోర్, బోధ్‌గయ తదితర న్యూ జనరేషన్ ఐఐఎంలలో సగటు వేతనాల్లో తగ్గుదల కనిపించింది. అయితే వీటిలో 100 శాతం ప్లేస్‌మెంట్స్ లభించడం విశేషం.

ఈ మూడు రంగాలు

ఐఐఎంలలో 2024 ఫైనల్ ప్లేస్‌మెంట్స్‌లో కన్సల్టింగ్, ఫైనాన్స్, జనరల్ మేనేజ్‌మెంట్ విభాగాల హవా కనిపించింది. అంతర్జాతీయంగా పేరున్న బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్, పీడబ్ల్యూసీ, డెలాయిట్, కేపీఎంజీ, ఈ అండ్ వై తదితర సంస్థలు ఆఫర్ల విషయంలో ముందంజలో నిలిచాయి. వీటితో పాటు బీఎఫ్‌ఎస్‌ఐ, ఈ-కామర్స్, ఎడ్‌టెక్, ఫిన్‌టెక్, ఐటీ/ఐటీఈఎస్ సంస్థలు కూడా భారీ నియామకాలు చేపట్టాయి.

కన్సల్టింగ్ హవా

మొత్తం ఆఫర్లలో దాదాపు 40 శాతం కన్సల్టింగ్ సంస్థల నుంచే ఉండటం విశేషం. కార్పొరేట్ కంపెనీలు వ్యాపార ప్రణాళికల విస్తరణలో భాగంగా కన్సల్టింగ్ సంస్థలను సంప్రదిస్తున్నాయి. ఇదే ఇప్పుడు కన్సల్టింగ్ కంపెనీల్లో నియామకాలు భారీగా పెరగడానికి కారణమని చెబుతున్నారు.

- ఈ-కామర్స్, స్టార్టప్స్ ఆఫర్లు భారీగా లభించాయి. ఎప్పటి మాదిరిగానే కన్సల్టింగ్, బీఎఫ్ఎస్‌ఐ సంస్థలు ఆఫర్లలో ముందు వరుసలో నిలిచాయి. అదే విధంగా మాన్యు ఫ్యాక్చరింగ్ విభాగంలోనూ నియామకాలు ఆశాజనకంగానే కనిపించాయి. వీటిలోనూ అధిక శాతం డేటా అనాలిసిస్, బిగ్ డేటా, మార్కెటింగ్, ఫైనాన్స్ భాగాల్లోనే లభించాయి.

కంపెనీలు కోరుకుంటున్న లక్షణాలు

ఐఐఎం విద్యార్థులకు ఆఫర్లు ఖరారు చేసిన కార్పొరేట్ సంస్థలు.. ప్రాబ్లమ్ సాల్వింగ్ స్కిల్స్, ఇంటర్ పర్సనల్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్ వంటి నైపుణ్యాలకు ప్రాధాన్యం ఇచ్చాయి. కోర్ స్కిల్స్ కోణంలో సబ్జెక్ట్ నాలెడ్జ్‌తోపాటు సదరు సబ్జెక్ట్‌కు సంబంధించి డిజిటల్ నైపుణ్యాలున్న విద్యార్థుల కోసం ప్రత్యేక దృష్టి పెట్టాయి. అదే విధంగా బిజినెస్ అనలిటిక్స్, డేటా అనలిటిక్స్, డేటా మేనేజ్‌మెంట్ వంటి లేటెస్ట్ స్కిల్స్ ఉన్న విద్యార్థులకు పెద్ద పీట వేశాయని ఆయా గణంకాలు స్పష్టం చేస్తున్నాయి.

జాబ్ పాయింట్

సిడ్బీలో 22 కన్సల్టెంట్ క్రెడిట్ అనలిస్ట్ పోస్టులు

లక్నోలోని స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(సిడ్బీ).. ఒప్పంద ప్రాతిపదికన కన్సల్టెంట్ క్రెడిట్ అనలిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 22.
» **పోస్టుల వివరాలు:** కన్సల్టెంట్ క్రెడిట్ అనలిస్ట్-19, అకౌంట్స్ అండ్ ట్యాక్స్ కన్సల్టెట్ (ఏటీసీ)-03.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో సీఏ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 28 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీలకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **ఎంపిక విధానం:** సైకోమెట్రిక్ టెస్ట్, షార్ట్‌లిస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం:
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 10.10.2024.
» **పనిచేయాల్సిన ప్రదేశాలు:** ముంబై, లక్నో, న్యూఢిల్లీ, అహ్మదాబాద్, చెన్నై.
» **వెబ్‌సైట్:** https://www.sidbi.in/en/

సిడ్బీలో జూనియర్ లెవల్ ఆఫీసర్ పోస్టులు

లక్నోలోని స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(సిడ్బీ).. ఒప్పంద ప్రాతిపదికన జూనియర్ లెవల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 03.
» **విభాగాలు:** మిడ్ ఆఫీస్ (మార్కెట్ రిస్క్ మేనేజర్), ఆపరేషనల్ రిస్క్ మేనేజర్.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో సీఏ/సీఎఫ్ఏ, బీఈ/బీటెక్, ఎంబీఏ/ఎంఎంఎస్/ఎంఎస్/పీజీడీఎం(ఫైనాన్స్), ఎంఎస్సీ/ఎంఏ (మ్యాథ్స్ /స్టాటిస్టిక్స్/ ఎకనామిక్స్) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 35 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీలకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **ఎంపిక విధానం:** మెరిట్ లిస్ట్, షార్ట్‌లిస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం:
» **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా
» **ఈమెయిల్:** RIMV_MidOffice@sidbi.in.
» **దరఖాస్తులకు చివరితేది:** 18.10.2024.
» **పని చేయాల్సిన ప్రదేశం:** ముంబై.
» **వెబ్‌సైట్:** https://www.sidbi.in/

సెస్, హైదరాబాద్‌లో వివిధ ఉద్యోగాలు

హైదరాబాద్‌లోని తెలంగాణ ప్రభుత్వ మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖలో సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్(సెస్).. ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 05.
» **పోస్టుల వివరాలు:** ప్రోగ్రామ్ ఆఫీసర్-01, అకౌంటెంట్స్ ఆఫీసర్-01, అసిస్టెంట్ కమ్ డేటా ఎంట్రీ ఆపరేటర్-02, అటెండర్-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, 12వ తరగతి ఉత్తీర్ణులవ్వాలి. సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవముండాలి.
» **వయసు:** 21 ఏళ్లు మించకూడదు.

ముఖ్య సమాచారం:
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును సంబంధిత సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో పాటు డైరెక్టర్, సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్, నిజామియా అబ్జర్వేటరీ క్యాంపస్, బేగంపేట్, హైదరాబాద్ చిరునామకు వ్యక్తిగతంగా లేదా రిజిస్టర్డ్/స్పీడ్ పోస్టు ద్వారా నోటిఫికేషన్ వెలువడిన 15 రోజుల్లోగా పంపించాలి.
» **నోటిఫికేషన్ తేది:** 29.09.2024.
» **వెబ్‌సైట్:** http://cess.ac.in/

ట్రిపుల్ ఐటీ డీఎం కర్నూల్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు

కర్నూల్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్(ట్రిపుల్ ఐటీ డీఎం).. తాత్కాలిక ప్రాతిపదికన అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. » **మొత్తం పోస్టుల సంఖ్య:** 02.
» **విభాగం:** కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్.
» **అర్హత:** పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.70,000.

ముఖ్య సమాచారం:
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును రిజిస్ట్రార్, ట్రిపుల్‌ఐటీ డీఎం కర్నూలు, జగన్నాథగట్టు, కర్నూలు చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 22.10.2024.
» **వెబ్‌సైట్:** http://iiitk.ac.in/

ట్రిపుల్ ఐటీ శ్రీ సిటీ, చిత్తూరులో టీచింగ్ పోస్టులు

చిత్తూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శ్రీ సిటీ(ట్రిపుల్ ఐటీ శ్రీ సిటీ).. టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **పోస్టులు:** విజిటింగ్ ఫ్యాకల్టీ/అడ్జంక్ట్ ఫ్యాకల్టీ.
» **విభాగాలు:** కంప్యూటర్ అండ్ కమ్యూనికేషన్ నెట్‌వర్క్, డేటా అనాలిసిస్, ఏఐఎంఎల్, డీప్ లెర్నింగ్, పైథాన్ ఫర్ డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ.
» **అర్హత:** సంబంధిత విభాగంలో పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణులవ్వాలి. పని అనుభవం తప్పనిసరిగా ఉండాలి.

ముఖ్య సమాచారం:
» **స్కాన్ చేసిన సర్టిఫికేట్‌లు పంపాల్సిన ఈమెయిల్:** careers.faculty@iiits.in.
» **దరఖాస్తులకు చివరితేది:** 15.11.2024.
» **వెబ్‌సైట్:** https://www.iiits.ac.in/